మహాభారతం- వ్యవహారదర్శనమ్.

1.నార్థమల్పం పరిభవేన్నావమన్యేత శాత్రవాన్.

బుద్ధ్యా తు బుద్ధ్యేదాత్మానం న చాబుద్ధిషు విశ్వసేత్.

తా.కొద్దిపాటి ధనమే కదా అని తిరస్కరిచకు. శత్రువు బలహీనుడు కదా అని వానిని అవమానించకు. నీ బుద్ధితో నిన్ను గూర్చి తెలుసుకో. బుద్ధిలేనివారిని నమ్మకు.

2.ధృతిర్దాక్ష్యం సంయమో బుద్ధిరాత్మా

 ధైర్యం శౌర్యం దేశకాలాప్రమాదః.

అల్పస్య వా బహునో వా వివృద్ధౌ

 ధనస్యైతాన్యష్ట సమిన్ధనాని.

తా.ధారణాశక్తి, నైపుణ్యము, మనస్సు- ఇంద్రియాలను తన వశంలో ఉంచుకోవటం, బుద్ధి, శరీరము, ధైర్యము, శౌర్యము,దేశకాలపరిస్థితుల యందు అప్రమత్తంగా ఉండటం- ఈ ఎనిమిది గుణాలు కొంచెం ధనమున్నా ఎక్కువ ధనమున్నా దానిని అభివృద్ధి చేయటానికి సాధనాలు. అనగా ధనరూపమైన అగ్నిని బాగా మండించటానికి ఇంధనాలు.

3.క్షేమాక్షేమం చ మార్గేషు సమాని విషమాణి చ .

అర్థినాం యే చ వక్ష్యన్తితే నరాః స్వర్గగామినః.

తా.యవడైతే మార్గం లో దారి అడిగేవారికి క్షేమమైన మార్గాన్ని, చెడ్డమార్గాన్ని, సుఖమైన లేదా దుఃఖదాయకమైన మార్గాన్ని చెప్తాడో వాడు స్వర్గమునకు వెళతాడు.

4.మాతరం పితరం చైవ శుశ్రూషన్తి చ యే నరాః.

భ్రాతృణామపి సస్నేహాస్తేనరాః స్వర్గగామినః.

తా.యే నరులైతే తల్లికి- తండ్రికి సేవ చేస్తారో ,అన్నదమ్ములతో స్నేహంగా ఉంటారో ఆ నరులు స్వర్గమునకు వెళతారు.

5.అనమన్త్రితో న గచ్ఛేత యజ్ఞం గచ్ఛేత దర్శకః.

అనర్చితే హ్యనాయుష్యం గమనం తత్ర భారత.

తా.భారత!ఆహ్వానించకుండా ఎక్కడికీ వెళ్లకు. కానీ యజ్ఞానికి పిలవకపోయినా వెళ్ళు.  ఆదరణలేని చోటికి వెళ్లటం వలన ఆయువు నశిస్తుంది.

6.మాతృపితృగురూణాం చ కార్యమేవానుశాసనమ్.

హితం చాప్యహితం చాపి న విచార్యం నరర్షభ.

తా.నరశ్రేష్ఠుడా!తల్లిదండ్రిగురువులు  అప్పగించిన పనిని శాసనం గా భావించి అది మేలు చేస్తుందా లేక మేలు చేయదా అని విచారించకుండా చేయవలెను.

7.వక్త్రప్రమాణాన్ పిండాంశ్చ గ్రసేదేకైకశఃపునః.

వక్త్రాధికం తు యత్  పిండమాత్మోచ్ఛిష్టం తదుచ్యతే.

తా. నోటిలో పట్టకలిగిన ముద్దలనే ఒక్కొకొకటిగా తినాలి. నోటిలో ముద్ద పెట్టిన తరువాత మిగిలిన ముద్ద తన ఉచ్ఛిష్టం ( ఎంగిలి) ఔతుంది.

8. పిండావశిష్టమన్యచ్చ వక్త్రాన్నిస్రుతమేవ చ.

అభోజ్యం తత్ విజానీయాద్ భుక్త్వా చాంద్రాయణం వ్రతమ్.

తా. నోటిలో ముద్ద పెట్టుకున్న తరువాత మిగిలిన అన్నము,నోటిలో నుండి పడిన అన్నము తినకూడనివిగా తెలుసుకోవాలి. అలా తిన్నట్లైతే చాంద్రాయణవ్రతము ఆచరించాలి.

9. స్వముచ్ఛిష్టం తు యో భుంక్తే యో భుంక్తే ముక్తభోజనమ్.

చాద్రాయణం చరేత్ కృచ్ఛ్రం ప్రాజాపత్యమథాపి వా.

తా. తన ఎంగిలితిన్ననూ, తన భోజనమైన తరువాత మళ్లీ తన పళ్లెంలో మిగిలిన అన్నాన్ని తిన్నా చాంద్రాయణ వ్రతము, కృచ్ఛ్రము లేదా ప్రాజాపత్యము చేయాలి.

10. పిబతఃపతితో తోయే భోజనే ముఖనిస్సృతే.

అభోజ్యం తద్ విజానీయాద్ భుక్త్వా చాంద్రాయణవ్రతం చరేత్.

తా. నీటిని త్రాగుతారు నున్నప్పుడు ఆ నీరు నోటినుండి భోజనంలో పడితే ఆ భోజనము చేయరాదు. అలా చేస్తే చాంద్రాయణ వ్రతము చేయాలి.

11. పీతశేషం తు తన్నామ న పిబేత్ పాండునందన.

పిబేద్ యది హి తన్మోహాద్ ద్విజశ్చాంద్రాయణం చరేత్.

తా. పాండుకుమారుడా! త్రాగగా మిగిలిన నీటిని మరల తతరాగరాదు. ఒకవేళ మోహమువలన ఆ నీటిని త్రాగితే ద్విజుడు చాంద్రాయణ వ్రతం చేయాలి.

12. మౌనీ వాప్యథవా భూమౌ నావలోక్య దిశస్తథా.

భుంజీత విధివద్విప్రో న చోచ్ఛిష్టం ప్రదాపయేత్.

తా.విప్రుడు మౌనంగా ఉండి నేలను కానీ దిక్కులను గానీ చూడక విధి విధానంగా భోజనం చేయాలి. తన ఎంగిలిని ఇంకొకరికి పెట్టరాదు.

13. సదాచాత్యశనం నాద్యాన్నాతిహీనం చ కర్హిచిత్.

యథాన్నేన వృథా న స్యాత్ తథా భుంజీత నిత్యశః.

తా. ఒక్కొక్కసారి ఎక్కువ అన్నం తినటం , ఒక్కొక్కసారి తక్కువ అన్నం తినటం చేయరాదు.ప్రతిరోజు ఎంత అన్నం తింటే తనకు బాధ కలగదో అంతే తినాలి.

14. కేశకీటోపపన్నం చ ముఖమారుతవీజితమ్.

అభోజ్యం తద్ విజానీయాద్ భుక్త్వా చాంద్రాయణం చరేత్.

తా. వెంట్రుకలు, పురుగులు పడిన న్నము, నోటితో ఊదిన అన్నము భుజించుటకు తగనిదిగా తెలుసుకొనుము. అవి తింటే చాంద్రాయణ వ్రతము చేయాలి.

15. ఉత్థాయచ పునస్స్పృష్టం పాదస్పృష్టం చ లంఘితమ్.

అన్నం తద్ రాక్షసం విద్యాత్ తస్మాత్ తత్ పరివర్జయేత్.

తా. తింటూ తింటూ లేచి మరల ముట్టుకున్న అన్నము, పాదము తాకిన అన్నము, దాటబడిన అన్నము రాక్షసులకు చెందినవిగా తెలుసుకొనుము.దానిని తినక వదిలివేయవలెను.

16.యద్యుత్తిష్ఠత్యనాచాన్తో భుక్తవానాసనాత్తతః.

స్నానం సద్యః ప్రకుర్వీత సోऽన్యథా ప్రయతో భవేత్.

తా. ఆచమనీయం చేయకుండా భోజనం చేసిన ద్విజుడు, భోజనం చేసిన తరువాత ఆచమనీయం చేయకుండా ఆసనం నుండి లేచిపోయాడు వెంటనే స్నానం చేయాలి.లేనిచో అపవిత్రుడౌతాడు.

17. నైకవాసస్తు భుంజీయాన్నచాంతర్ధాయ వా ద్విజః.

న భిన్నపాత్రే భుంజీత పర్ణపృష్ఠే తథైవ చ.

తా. ద్విజుడైనవాడు ఒకే వస్త్రముతో భోజనము చేయరాదు. అలాగే వస్త్రాన్ని నిండుగా కప్పుకుని భుజించరాదు. పగిలినపాత్రలో భుజించరాదు. విస్తరిని తిరగేసి భుజించరాదు.

18. అన్న పూర్వం నమస్కుర్యాత్ ప్రహృష్టేనాంతరాత్మనా.

నాన్యదాలోకయేదన్నాన్న జుగుప్సేత తత్పరః.

తా.ప్రసన్నచిత్తుడై భోజనానికి పూర్వం అన్నానికి నమస్కరించాలి. తినేటప్పుడు వేరు దానిమీద దృష్టి ఉంచరాదు.వడ్డించిన అన్నాన్ని అసహ్యించుకొనరాదు.( నిందించరాదు)

19. జుగుప్సితం చ యచ్చాన్నం రాక్షసా ఏవ భుంజతే.

పాణినా జలముద్ధృత్య కుర్యాదన్నం ప్రదక్షిణమ్.

తా. నిందించిన( అసహ్యించుకున్న ) అన్నాన్ని రాక్షసులు తింటారు.భోజనానికి ఆరంభంలో చేతితో నీటిని తీసుకొని అన్నము చుట్టూ ప్రదక్షిణంగా త్రిప్పాలి.

20. ఆర్ద్రపాదస్తు భుంజీత నార్ద్రపాదస్తు సంవిశేత్.

ఆర్ద్రపాదస్తు భుంజానో వర్షాణాం జీవతే శతమ్.

తా.తడిపాదములతో కూర్చుని భోజనం చేయాలి. కానీ తడిపాదములతోపడుకొనరాదు. తడిపాదములతో భోజనం చేసేవాడు వంద సంవత్సరాలు జీవిస్తాడు.

21. త్రీణి తేజాంసి నోచ్ఛిష్టం ఆలభేత కదాచన.

అగ్నిం గాం బ్రాహ్మణం చైవ తథాహ్యాయుర్న రిష్యతే.

తా. భోజనము చేసినతరువాత ముఖము చేతులు కడుగుకొనకుండా మూడు తేజస్సులను మూట్టుకొనరాదు.అవి-అగ్ని,గోవు, బ్రాహ్మణుడు. ఆ విధంగా చేసినట్లైతే ఆయువు నశిస్తుంది.

22. న పాణౌ లవణం విద్వాన్ ప్రాశ్నీయాన్న చ రాత్రిషు.

దధిసక్తూ న భుంజీత వృథా మాంసం చ వర్జయేత్.

తా. విద్వాంసుడైనవాడు ఉప్పుని చేతితో తినరాదు.రాత్రులయందు పెరుగు, సత్తుపిండి( సంకటి) తినరాదు. వృథాగా మాంసమును తినరాదు.( మాంసముతినేవారికి)

23. సాయం ప్రాతశ్చ భుంజీత నాంతరాళే సమాహితః.

బాలేన తు న భుంజీత పరశ్రాద్ధం తథైవ చ.

తా. సాయంత్రము, ఉదయము భోజనం చేయాలి. మధ్యలో ఏమియూ తినరాదు. ఉడుకుతూ ఉన్న భోజనము చేయరాదు.( బాగా వేడిగా) జ్ఞాతులు కాక ఇతరులు పెట్టినశ్రాద్ధభోజనాన్ని తినరాదు.

24. వాగ్యతో  నైకవస్త్రశ్చ నాసంవిష్టః కదాచన.

భూమౌ సదైవ నాశ్నీయాత్ నానాసీనో న శబ్దవత్.

తా. భోజనం చేసే సమయంలో ఎక్కువ మాట్లాడరాదు. ఏకవస్త్రముతో భోజనం చేయరాదు. సరిగా కూర్చోకుండా అటూ ఇటూ కదులుతూ భోజనం చేయరాదు. నేలమీద ఎప్పుడూ భోజనం చేయరాదు. ఒకే ఆసనం మీద కూర్చోకుండా వేరు వేరు ఆసనముల మీద కూర్చొంటూ భోజనం చేయరాదు. తినేటప్పుడు శబ్దము చేయరాదు.

25. తోయపూర్వం ప్రదాయాన్నం అతిథిభ్యో విశాంపతే.

పశ్చాత్ భుంజీత మేధావీ నచాప్యన్యమనా నరః.

తా. ప్రజానాథ! బుద్ధిమంతుడైనవాడు మొదటగా అతిథికి మంచినీటిని ఇచ్చి అన్నము పెట్టిన తరువాత ఏకాగ్రచిత్తుడై భోజనం చేయాలి.

26. సమానమేకపంక్త్యా తు భోజ్యమన్నం నరేశ్వర.

విషం హాలాహలం భుంక్తే యోऽప్రదాయ సుహృజ్జనే.

తా. నరేశ్వర! ఏక పంక్తిలో ఉన్నప్పుడు అందరితో సమానంగా ఆ  పదార్థాలు మాత్రమే తినాలి. ఆ పంక్తిలోనివారికి వడ్డించకుండా తాను మాత్రమే తిన్న అన్నము హాలాహలవిషముతో సమానము.

27. పానీయం పాయసం సక్తూన్ దధిసర్పిన్మధూన్యపి.

నిరస్య శేషమన్యేషాం న ప్రదేయం తు కస్యచిత్.

తా. పానీయము,( శీతలపానీయాలు మొదలైనవి) పాయసము,సత్తు పిండి( సంగటి) పెరుగు,నేయి, తేనె - వీటిని ఇవ్వకుండా అన్యపదార్థాలను ఎవరికీ ఇవ్వరాదు( ఇవి ఉంటే వీటిని కూడా ఇవ్వాలి)

28. భుంజానో మనుజవ్యాఘ్ర నైవ శంకాం సమాచరేత్.

దధిచాప్యనుపానం వై న కర్తవ్యం కదాచన.

తా. మనుజశ్రేష్ఠా! భోజనము చేస్తున్నప్పుడు భోజనాన్ని, పెట్టేవారిని అనుమానించరాదు. ఎల్లప్పుడూ అన్నం తిన్న తరువాత పెరుగును తినరాదు.

29. వర్జనీయాంశ్చైవ నిత్యం పై సంఖ్యలో నిశి భారత.

శేషాణి చైవ పానాని పానీయం చాపి భోజనే.

తా. భారత! ఎల్లప్పుడూ రాత్రులయందు సత్తుపిండి( పేలపిండి, సంకటి మొదలైనవి) తినరాదు. భోజనమైన తరువాత త్రాగగా మిగిలిన నీటిని , పానీయాలను త్రాగరాదు.

30. సౌహిత్యం న చ కర్తవ్యం రాత్రౌ న చ సమాచరేత్.

ద్విజచ్ఛేదం న కుర్వీత రాత్రౌ న చ సమాచరేత్.

తా. ఎల్లప్పుడూ తృప్తిగా భుజించవద్దు. రాత్రుల యందు ఎప్పుడూ కూడా తృప్తిగా భుచించవద్దు( ఒకవేళ పగలు ఎప్పుడైనా తృప్తిగా తిన్నా రాత్రి మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ తృప్తిగా తినవద్దు). పక్షి,సర్పము, మత్స్యము( ద్విజః- రెండు జన్మలు గలవి. గ్రుడ్డు గా ఒక జన్మ.పొదిగి పిల్ల ఐన తరవాత మరొక జన్మ) వధించరాదు. రాత్రుల యందు అసలు వధింపరాదు.

31. సంధ్యాయాం న చ భుంజీత న స్నాయేన్న తథా పఠేత్.

ప్రయతశ్చ భవేత్సత్యాం న చ కించిత్సమాచరేత్.

తా. సంధ్యా కాలంలో తినవద్దు. స్నానము చేయవద్దు. అదేవిధంగా చదువువద్దు . ప్రయత్నపూర్వకంగా ధ్యానాన్ని , ఉపాసనను చేయాలి. అన్యమైనవి ఏ కొంచెమైననూ ఆచరింపరాదు.

➡ ఈ క్రింది మూడు శ్లోకాలను గూర్చి: లక్ష్మీదేవి దానవులను విడిచి ఇంద్రుని వద్దకు వస్తుంది. అప్పుడు ఇంద్రుడు ఆమెకు నమస్కరించి నీవు దానవులను విడిచి పెట్టటానికి కారణమేమిటని అడిగినపుడు చెప్పినవాటిలోనివి.

32. స్త్రియఃపురుషవేషేణ పుంసః స్త్రీవేషధారిణః.

క్రీడారతివిహారేషు పరాం ముదమవాప్నువన్.

తా. స్త్రీలు పురుషులవస్త్రాలను ధరించి , పురుషులు స్త్రీల వస్త్రాలు ధరించి ఆటలలోను, స్త్రీపురుషులు కలిసినప్పుడు,విహరించేటప్పుడు సంతోషాన్ని పొందేవారు.

33. మాతరం పితరం వృద్ధమాచార్యమతిథిం గురుమ్.

గురుత్వాన్నాభినన్దన్త కుమారాన్ నాన్వపాలయన్.

తా.గొప్పవారైనప్పుడు తల్లిని,తండ్రిని, ఆచార్యుని,అతిథిని,గురువుని అభినందించేవారు కాదు. పిల్లల పెంపకంలో ధ్యాస ఉంచేవారు కాదు.

34. న శౌచమనురుద్ధ్యన్త తేషాం సూదజనాస్తథా.

మనసా కర్మణా వాచా భక్ష్యమాసీదనావృతమ్.

తా. వారు ( రాక్షసులు) శౌచాన్ని పాటించరు. అలాగే వారికి వంటచేసేవారు కూడా మనసా వాచా కర్మణా శౌచాన్ని పాటించరు. తినబడే ఆహారపదార్థాలు అనాచ్ఛాదితంగా( మూతలేకుండా ) ఉంటాయి.

అతిథి సేవనం:-

35. అతిథిం నావమన్యేత నానృతం గిరమీరయేత్.

న పృచ్ఛేద్ గోత్రచరణం నాధీతం వా కదాచన.

తా. అతిథిని అవమానించరాదు. మిథ్యావాక్యములు పలుకవద్దు. ( లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు) వచ్చినవాని గోత్రాన్ని,శాఖను,అధ్యయనాన్ని గూర్చి అడుగరాదు.

36. క్రోధముత్పాదితం హిత్వా సుశీలో వీతమత్సరః.

అర్చయేదతిథిం ప్రీతః పరత్ర హితభూతయే.

తా. పరలోకమున హితమును కోరుకుసేవారు ఇంటికి వచ్చిన అతిథి యందు కోపమున్ననూ దానిని నిగ్రహించి, మత్సరాన్ని విడిచి ,సుశీలుడై, ప్రసన్నుడై అతిథిని సేవించాలి.

37. చండాలో వై శ్వపాకో వా కాలే యః కశ్చిదాగతః.

అన్నేన పూజనీయః స్యాత్ పరత్ర హితమిచ్ఛతా.

తా. భోజనసమయంలో చండాలుడు గానీ, శ్వపాకుడు( కుక్క మాంసం తినేవాడు) గాని, ఇంకెవరు వచ్చినప్పటికీ పరలోకమున హితాన్ని కోరుకుసేవాడు ఆ వచ్చినవారికి  అన్నము పెట్టి తృప్తి పరచాలి.

38. అన్నదః ప్రాణదో లోకే ప్రాణదః సర్వదో భవేత్.

తస్మాదన్నం విశేషేణ దాతవ్యం భూతిమిచ్ఛతా.

తా. లోకంలో అన్నాన్ని పెట్టేవాడే ప్రాణాలను నిలబెట్టే వాడు. ప్రాణదాత అన్నీ ఇచ్చినవాడౌతాడు. అందువలన తన శుభాన్ని కోరుకుసేవాడు అన్నదానాన్ని విశేషంగా చేయాలి.

నిత్యము చేయవలసిన కర్తవ్యాలు:-

39.బాల్యే విద్యాం నిషేవేత యౌవనే దారసంగ్రహమ్.

వార్ధకే మౌనమాతిష్ఠేద్ సర్వదా ధర్మమాచరేత్.

తా. బాల్యమునందు విద్యను నేర్వాలి. యౌవనంలో వివాహమాడి భార్యను ( భర్తను) స్వీకరించాలి. ముసలితనములో మునులవృత్తులను అవలంభించాలి.ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆచరించాలి.

40. బ్రాహ్మణాన్ నావమన్యేత గురూన్ పరివదేన్నచ.

యతీనామనుకూలస్యాదేష ధర్మఃసనాతనః.

తా. బ్రాహ్మణులను అవమానించరాదు. గురువులను నిందించరాదు.మహాత్ములైన యతులకు అనుకూలంగా వ్యవహరించవలెను. ఇదియే సనాతనమైన ధర్మము.

41. యతిర్గుర్ద్విజాతీనాం వర్ణానాం బ్రాహ్మణో గురుః.

పతిరేవ గురుఃస్త్రీణాం సర్వేషాం పార్థివో గురుః.

తా. ద్విజులకు( బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు) యతి (సన్యాసి) యే గురువు . అన్ని వర్ణములవారికి బ్రాహ్మణుడు గురువు. స్త్రీకి భర్తయే గురువు. అందరికీ రాజు గురువు.

42.ఆచారాల్లభతే హ్యాయురాచారాల్లభతే శ్రియమ్.

ఆచారాత్ కీర్తిమాప్నోతి పురుషః ప్రేత్య చేహ చ.

తా. ఆచారము వలన మానవుడు ఆయువును పొందుతున్నాడు. ఆచారము వలన సంపద లభిస్తుంది. ఆచారమూ వలన ఇహలోకంలో పరలోకంలోను కీర్తి లభిస్తుంది.

43. లోష్టమర్దీ తృణచ్ఛేదీ నఖఖాదీ చ యో నరః.

నిత్యోచ్ఛిష్టః సంకుసకో నేహాయుర్విందతే మహత్.

తా.మట్టిబెడ్డలను చితక్కొట్టేవాడు( అవసరం లేకుండా) గడ్డిపరకలను త్రుంచే వాడు, గోళ్లు తినేవాడు( కొరికేవాడు) ఎప్పుడూ ఎంగిలితో ఉండేవాడు , నిలకడలేక చంచలంగా ఉండేవాడు( స్థిరం గా ఉండకుండా ఇటూ అటూ ఊగుతూండటం) ఈ లక్షణాలు

ఉన్నవాడు గొప్ప ఆయువును పొందలేడు.

44. ప్రసాధనం చ కేశానాం అంజనం దంతధావనం .

పూర్వాహ్ణే ఏవ కార్యాణి దేవతానాం చ పూజనమ్.

తా.తలదువ్వుకోవటం, కాటుక పెట్టుకోవటం, పండ్లు తోమటం, దేవతలను పూజించటం - ఇవి పూర్వాహ్ణమునందే ( ఉదయముననే) చేయాలి.

45. మాధ్యందినే నిశాకాలే అర్ధరాత్రే చ సర్వదా.

చతుష్పథం న సేవేత ఉభే సంధ్యే తథైవ చ.

ఉపానహౌ చ వస్త్రం చ ధృతమన్యైర్న ధారయేత్.

తా. మధ్యాహ్న సమయంలో, చీకటి వేళలో,అర్ధరాత్రి, ఉభయసంధ్యలలోను నాలుగు మార్గముల కూడలి యందు( చౌరాస్తా) ఉండరాదు. చెప్పులు, వస్త్రములను ఇంకొకరు ధరించినవి ధరించరాదు.

46. కృత్వా మూత్రపురీషేతు రథ్యామాక్రమ్య వా పునః.

పాదప్రక్షాళనం కుర్యాత్ స్వాధ్యాయే భోజనే తథా.

తా. మలమూత్రములు విసర్జించినప్పుడు, రహదారుల యందు( రోడ్లవెంట) నడచినప్పుడు, స్వాధ్యాయమైన తరువాత, భోజనమైన తరువాత పాదములను కడుగుకొనవలెను.

46. ఊర్ధ్వం ప్రాణా హ్యుత్క్రమన్తి యూనఃస్థవిర ఆయతి.

ప్రత్యుత్థానాభివాదాభ్యాం పునస్తాన్ ప్రతిపద్యతే.

తా. పెద్దవారు, వృద్ధులు వచ్చినప్పుడు వారి ఎదుట ఉన్న చిన్నవారి ప్రాణాలు పైకి లేస్తాయి. వారు ఎదురైనప్పుడు వెంటనే లేచి నమస్కరించినట్లైతే మరల వారి ప్రాణాలు యథాస్థితిలో ఉంటాయి.( పెద్దవారు వచ్చినప్పుడు లేచి నిలబడి నమస్కరించకపోతే ఆయుష్షు క్షీణిస్తుంది)

47.అభివాదీయత వృద్ధాంశ్చ దద్యాచ్చైవాసనం స్వయమ్.

కృతాంజలిరుపాసీత గచ్ఛంతం పృష్ఠతోఽన్వియాత్.

తా. పెద్దవారికి నమస్కరించాలి. స్వయంగా కూర్చొనుటకు ఆసనాన్ని ఇవ్వాలి. దోసిలి పట్టి వారి వద్ద కూర్చోవాలి. వారు వెళుతున్నప్పుడు వారి వెనుకే కొంతదూరం వెళ్లాలి.

48.నాస్తిక్యం వేదనిందాం చ దేవతానాం చ కుత్సనమ్.

ద్వేషస్తభోభిమానం చ తైక్ష్ణ్యం చ పరివర్జయేత్.

తా.నాస్తికత్వం, వేదనింద,దేవతలను నిందించటం, ద్వేషము, మందకొడితనము, అభిమానము, కాఠిన్యము- ఈ దుర్గుణాలను వదిలివేయాలి.

49. హీనాంగానతిరిక్తాంగాన్ విద్యాహీనాన్ విగర్హితాన్.

రూపద్రవిణహీనాంశ్చ సత్త్వహీనాంశ్చ నాక్షిపేత్.

తా. హీనాంగులను,అధికముగా అంగములు కలవారిని,విద్యలేనివారిని , నిందనీయులైనవారిని,కురూపులను, డబ్బులేనివారిని,బలము లేనివారిని ఆక్షేపించరాదు.

50.ఆగమానాం హి సర్వేషాం ఆచారః శ్రేష్ఠ ఉచ్యతే.

ఆచారప్రభవో ధర్మో ధర్మాదాయుర్వివర్ధతే.

తా. అన్ని ఆగమములయందు సదాచారమే శ్రేష్ఠమని చెప్పబడుతోంది. ఆచారము నుండి ధర్మము వచ్చినది. ధర్మము వలన ఆయుష్షు పెరుగుతుంది.

51. న హింస్యాత్ సర్వభూతాని మైత్రాయణగతశ్చరేత్ .

నేదం జన్మసమాసాద్య వైరం కుర్వీత కేనచిత్.

తా. ఏ ప్రాణులను హింసించకు. స్నేహంగా ఉండు.ఈ మానవ జన్మను పొంది యెవరితోను వైరాన్ని పెట్టుకొనకు.

52. శ్వః కార్యమద్య కుర్వీత పూర్వాహ్ణేచాపరాహ్ణికమ్.

న హి ప్రతీక్షతే మృత్యుః కృతం వాస్య న వాకృతమ్.

తా. రేపు చేయదలచుకున్న పనిని ఈరోజే చేయి. అపరాహ్ణం( సాయంకాలం) చేద్దామనుకున్న పనిని ఉదయమే చేయి. మృత్యువు వీడు చేయవలసిన పని అయిందా లేదా అని నీ కోసం వేచి ఉండదు.

"స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ " అని శ్రీకృష్ణపరమాత్మ గీతలో బోధించెను. మనం నిత్యం చేసే పనులలోనే మనం చేయకలిగేవి చేస్తే వాటివలననే అధికమైన సత్ఫలితం ఉంటుందని భారతంలో వ్యాసులవారు నిత్యజీవితంలో ఎలా నడిస్తే శుభం కలుగుతుంది? ఏది సదాచారమని చాలా సందర్భాలలో చెప్పారు. జీవితంలో చేయలేనివి , అందరికీ సాధ్యం కానివి గొప్పగొప్ప ధర్మాలు ఉండవచ్చు. కానీ అందరు పాటించకలిగినవి, సులభమైనవి చాలా చిన్న చిన్న పనులు. ధర్మమంటే సరైన దారి , సరైన నడక అని. అది మనం పెద్దలనుండి ఆచరిస్తూ వస్తున్నదే. అదే ఆచారం. "ఆచారప్రభవో ధర్మః ధర్మస్య ప్రభురచ్యుతః" ఆచారము నుండి ధర్మము వచ్చినదని, ధర్మానికి ప్రభువు అచ్యుతుడని విష్ణుసహస్రనామఫలశ్రుతి. ఆచారాన్ని పాటిస్తే అదే ధర్మము. దానిని పాటించిన వానిని అచ్యుతుడు ఎక్కడినుండీ కూడా క్రింద పడనివ్వడు.

రోజు మనం పాటించేవాటిలోనే కొంత జాగ్రత్తగా వ్యాసులవారు చెప్పినట్లు పాటిస్తే అదే ధర్మము . మనల్ని రక్షించేది అదే.

నిత్య వ్యవహారం ఎలా ఉండాలనే విషయాలను గూర్చి మహాభారతంలోని కొన్ని శ్లోకాలను పొందుపరచటం జరిగింది.

-- బాలా చిర్రావూరి.